క్లుప్తంగా

డెత్ ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



రాజ్యసభ సభ్యుడు సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కురిచేడు: ప్రతిపౌరుడికి డెత్ ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేలా ఉభయ సభల్లో ప్రస్తావన తీసుకురావాలని రెడ్‌క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డికి విన్నవించారు. ఆదివారం ఒంగోలులోని వైవీ నివాసంలో శ్రీనివాసరెడ్డి ఆయనను కలిసి వివరించారు. ప్రపంచంలోని అన్ని ప్రజాస్వామ్య దేశాలలో డెత్ ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుందని, అలాగే మన దేశంలో కూడా ప్రభుత్వం చెల్లించేలా రాజ్యసభలో ప్రస్తావించాలని ఆయన కోరారు. అనంతరం ఎంపీ మాగుంటను కలిసి ఈ విషయమై చర్చించారన్నారు. వారు సానుకూలంగా స్పందిస్తూ ఉభయ సభల్లో ఈవిషయమై చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

బైకులు ఢీకొని ఒకరికి గాయాలు

మద్దిపాడు: మద్దిపాడులోని జగనన్న కాలనీకి వెళ్లే సర్వీస్ రోడ్డులో ఆదివారం ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొని ఆలపాటి శ్రీకాంత్ అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని 108లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించినట్లు ఎస్ఐ శివరామయ్య తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



పుల్లలచెరువులో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న సభ్యులు



పెద్దదోర్నాలలోని విఘ్నేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎస్సై మహేష్



దొనకొండలో పంచాంగం వినిపిస్తున్న పురోహితుడు

ఉగాది.. తెలుగు వెలుగుల ఉషస్సు

- భక్తిశ్రద్ధలతో విశ్వావసు ఉగాది పండుగ
- కిటకిటలాడిన ఆలయాలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం

పెద్దదోర్నాల: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను ఆదివారం నియోజకవర్గ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే తమ లోగిళ్లను మామిడి తోరణాలతో అలంకరించుకొని ఇంటిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. అనంతరం ఉగాది పచ్చడి ఆరగించారు. ఆలయాలకు వెళ్లి విశేషపూజలు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం గావించారు. షడ్రుచుల సమ్మేళనంతో నూతన తెలుగు సంవత్సర సంబరాలు పెద్దదోర్నాలలో అంబరాన్నంటాయి. ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలోని పలు వైష్ణవ, శైవ క్షేత్రాలు భక్తజనంతో పోటెత్తాయి. నూతన సంవత్సరాన అంతా శుభం కలగాలని వేలాది మంది భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవమూర్తులను వెండి, పసిడి అభరణాలతో, మంత్ర పరిమళ పుష్పాలతో శోభయామనంగా అలంకరించారు. ఆదివారం వేకువజాము నుంచే స్వామి వారికి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు అభిషేకాలు, సహస్ర నామార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారిని వెండి అభరణాలతో, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రముఖులు స్వామి వారిని దర్శించుకుని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అలయం, అయ్యప్ప దేవాలయం, షిర్డీ సాయి ఆలయం, పోలేరమ్మ ఆలయంలో ఉగాది పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా ఎస్సై మహేష్ సిబ్బందితో కలిసి విఘ్నేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు.



పుల్లలచెరువులో పంచాంగ శ్రవణం చేస్తున్న పూజారి



గోవిందమాంబ సమేత మద్విరాట్‌పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారు



పెద్దదోర్నాలలోని పోలేరమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ఉగాది పచ్చడి పంపిణీ..

పుల్లలచెరువు: విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉగాది పండుగను గ్రామాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలో గాంధీ కళాక్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు, పీ.ప్రసాద్, జి.గురునాథం, యూ.హనుమంతరావు, ఆర్మీ బుజ్జి, బాలరామాంజనేయులు, సీహెచ్ సుబ్బారావు, డిష్ చిన్నా, యు.సబ్బారావు, కే యల్లయ్య, ఆంజనేయులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

కురిచేడు: ఉగాది పర్వదిన సందర్భంగా కురిచేడు ఆలయాల్లో ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చనలు, శ్రీకాళహస్తీశ్వరస్వామికి అభిషేకాలు ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు చేయించారు. లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో సప్తాహ మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఆలయ పూజారి జూపూడి భువనేశ్వరాచారి భక్తులతో చేయించారు.

ఆలయాల్లో పంచాంగ శ్రవణం..

దొనకొండ: పల్లెల్లో ప్రజలు ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వచ్చే ఏడాది కాడి ఎద్దులతో వ్యవసాయ పనులు చేసి పంటలు పండించుకోవాలన్న తపనతో ఉగాది వేడుకలు కుటుంబం అంతా నూతన వస్త్రాలు ధరించి ఉగాది పచ్చడి, పిండి వంటలు చేసుకుని సంతోషంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున కాడి ఎద్దులను పూజించుకుని ఏరువాక సాగారు. స్థానిక ఆనంద ఆశ్రమంలో సకల దేవతలకు ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఆశ్రమ ప్రధాన అర్చకుడు మణిబాబు శర్మ పంచాంగ శ్రవణాన్ని చదివి వినిపించారు. అరవల్లిపాడుకు చెందిన బండారు మధుస్వామి అన్నదానం చేశారు. భైరవానంద స్వామి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

పుల్లలచెరువు: విశ్వావసు నామ సంవత్సరం అన్ని వర్గాల వారికి ఎంతో బాగుంటుందని పురోహితులు మధు తెలిపారు. ఉగాది సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త గజ్వల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో గాంధీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పూజారులు మధు, సాయిలు మాట్లాడుతూ ఈ విశ్వావసు నామసంవత్సరంలో రైతులకు మంచి జరుగుతుందని, సకాలంలో వర్షాలు పడతాయని, కొన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజలు వాటిని అధిగమిస్తారని అన్నారు. కార్యక్రమంలో గోవర్ధనాచార్యులు, శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

బూచేపల్లికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

దర్శి: విశ్వావసు ఉగాది సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి చీమకుర్తిలో తమ వారి నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. దర్శి మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, తాళ్లూరు మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి, నాయకులు కటకం శ్రీను, సంగు కొండారెడ్డి, దేవదానం, గువ్వల శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, జక్కుల రామకృష్ణ, జగన్, గువ్వల శ్రీనివాసరెడ్డి, పూనూరి దేవదానం, సంగు కొండారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను కలసి విశ్వావసు నామ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. వారిని దుశ్శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



తాళ్లూరు: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటిగంగ భవాని అమ్మవారికి ఉగాది పండగ సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టేల బాలరాజు, పి.విజయలక్ష్మీ మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బాహ్మణ అర్చకులు కామేశ్వరశర్మ అమ్మ వారికి అభిషేకాల, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ఈవె గుంటపల్లి వాసు,చైర్మన్ గురుబ్రహ్మం, ఆర్ఏ కె.ప్రసాద్, ఆలయ సిబ్బంది భక్తులకు వసతులు కల్పించారు.

ఘనంగా అంకమ్మతల్లి కొలుపులు..

దర్శి: మండలంలోని బండి వెలిగండ్ల గ్రామంలో కొలువై ఉన్న అంకమ్మతల్లి కొలుపులు గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఉగాది పర్వదినం రోజున కొలుపులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కొలుపులకు మహిళలు అధిక సంఖ్యలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నివేదన చేశారు. గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఎస్సై మురళీ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ



ఐసీ రెడ్డిని పరామర్శిస్తున్న బూచేపల్లి వెంకయ్యమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి

తాళ్లూరు: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఐవీ రెడ్డి తండ్రి ఐసీ రెడ్డిని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌డ్డి పరామర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఐసీ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం కొత్రపాటివారిపాలెం గ్రామ పార్టీ నాయకులు నిర్వహించిన పోలేరమ్మ మొక్కుబడి కార్యక్రమానికి పాల్గొన్నారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసిన వెంకాయమ్మ, శివప్రసాద్ రెడ్డి

అంధకారంలో ఏకలవ్య నగర్

- పనిచేయని స్తంభాలకు ఉన్న బల్బులు
- మరమ్మతులు చేయని పంచాయతీ అధికారులు
- విషపురుగుతో భయపడుతున్న గిరిజనులు

తాళ్లూరు: చుట్టూ పచ్చటి చెట్లతో ప్రకృతి ఆహ్వానిస్తూ కొండల మధ్యన ఎలాంటి కల్మషం లేకుండా జీవించడం వారి నైజం. కులవృత్తి అయిన గంపలు, చీపురుకట్టలు అమ్ముకొని అలాగే పైర్లు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలో ఉన్న సోమవర్పాడు గ్రామంలోని గుంటిగంగమ్మ దేవస్థానం నుంచి 2 కిలోమీటర్లు దూరంలో ఉంటుంది ఏకలవ్య నగర్. ఈ కాలనీలో సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. కాలనీలో సుమారు 60 గిరిజన కుటుంబాలు నివశిస్తున్నాయి. ప్రజలకు 7,8 నెలల నుంచి వీధి దీపాలు పని చేయడం లేదని, చీకటి పడిందంటే ఆ గ్రామం అంతా అంధకారంతో నిండి విషసర్పాలు, తేళ్లు, జెర్రులు వస్తున్నాయని వాపోతున్నారు. పనుల రీత్యా బయటకి రావాలంటే భయపడాల్సి వస్తోందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాగునీటి సమస్య కుడా ఉందని, తాగునీరు రానిరోజు సుదూర ప్రాంతమైన తూర్పుగంగవరం వెళ్లి తెచ్చుకోవల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తాగునీటి సమస్యతో పాటు స్తంభాలకు బల్బులు ఏర్పాటు చేసి వీధుల్లో వెలుతురు వచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



చీకటిలో మగ్గుతున్న ఏకలవ్య కాలనీ

అధికారులు పట్టించుకోవాలి..



30 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ నివాసం ఉంటున్నాం. 7–8 నెలల నుంచి వీధి స్తంభాలకు ఉన్న బల్బులు పనిచేయడం లేదు. విషసర్పాలు అధికంగా తిరుగుతున్నాయి. వెంటనే అధికారులు స్పందించి వీధి లైట్లు ఏర్పాటు చేయాలి.

– ఇట్టా రాధ, తూర్పుగంగవరం

స్తంభాలు బిగించారు, లైట్లు మరిచారు..



7–8 నెలల క్రితం కొత్త స్తంభాలు వేశారు. అప్పటి నుంచి వీధి స్తంభాలకు బల్బులు ఏర్పాటు చేయలేదు. ఏదైనా పని కోసం బయటకు వస్తే టార్చ్‌లైట్ వేసుకుని వెళ్లాల్సి వస్తోంది. బల్బులు వేసేలా చర్యలు తీసుకోవాలి.

– ఇట్టా బాబూరావు, ఏకలవ్య నగర్

పేదలకు జకాత్ పంపిణీ



జకాత్ పంపిణీ చేస్తున్న జమాఅతే నాయకులు

యర్రగొండపాలెం: రంజాన్ పండుగ సందర్భంగా జమాఅతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మజ్జిద్ ఎ ఉమర్‌బిన్ ఖత్తాప్‌లో పేదలకు జకాత్ పంపిణీ చేశారు. అనాథలు, నిరుపేదలు, వితంతువులైన 60 మందికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రసూల్, స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా పట్టణ అధ్యక్షుడు రియాజ్, జమాఅతే సభ్యులు అతహర్‌బాషా, రఫీ, గఫార్, సలీం, ఖలీల్, అద్నాన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు నివాళులు



వెంకట కోటయ్య (ఫైల్)

కురిచేడు: మండలంలోని గంగదొనకొండ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పోటు వెంకటకోటయ్య (65) మృతి పట్ల పార్టీ నాయకులు ఆసుపల్లి చెన్నారెడ్డి, పలువురు కార్యకర్తలతో కలిసి వెళ్లి తన సంతాపాన్ని మృతుని కుటుంబానికి తెలిపారు. వెంకట కోటయ్య కొంతకాలంగా కిడ్నీవ్యాధితో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. శనివారం చెన్నారెడ్డి, పుల్లారెడ్డి, కండెగంగయ్య, కర్నాటి వెంకట రెడ్డి, గంగయ్య తదితరులు మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం వెంకటకోటయ్య కుటుంబ సభ్యులకు చెన్నారెడ్డి ఆర్థిక సాయం చేశారు. మృతుడికి భార్య, నలుగురు సంతానం వున్నారు.



వెంకట కోటయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వసంత నవరాత్రులు ప్రారంభం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

త్రిపురాంతకం: స్థానిక బాల త్రిపుర సుందరి దేవి ఆలయంలో వసంత నవరాత్రి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉగాది పండుగ నుంచి శ్రీరామనవమి వరకు జరిగే ఈ మహోత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. ఈసందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహోత్సవాలను ఆలయ ధర్మకర్త, మండలి చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు పర్యవేక్షించారు.

వైభవంగా త్రిపురాంతకేశ్వరస్వామి గ్రామోత్సవాలు



త్రిపురాంతకేశ్వరస్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

త్రిపురాంతకం: ఉగాది పండుగను పురస్కరించుకొని ఆదివారం స్థానిక పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి గ్రామోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో జరిగిన ఊరేగింపులో భక్తులు అశేషంగా పాల్గొన్నారు. గ్రామంలో స్వామి ఊరి ఊరేగింపు సందర్భంగా భక్తులు అడుగు అడుగున నీళ్ల పోసి తమ భక్తిని చాటుకున్నారు. గ్రామ కూడళ్లలో పందిళ్లు వేసి ప్రత్యేక పూజలు చేశారు.